క్లుప్తంగా

రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్



గూడూరు: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రికార్డుల స్వచ్ఛీకరణ లక్ష్యంగా జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం నిర్వహిస్తున్నామని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. మండలంలో రీ సర్వే పూర్తి చేసుకున్న గురిజేపల్లి గ్రామంలో సర్వే రాళ్ల వేసే ప్రక్రియను తహసీల్దార్ విజయప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ఫలితంగా దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామన్నారు. తద్వారా రైతులు స్నేహపూర్వక వాతావరణంలో వ్యవసాయం సాగిస్తారని చెప్పారు. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా రీ సర్వే ఖర్చు అంతా ప్రభుత్వమే భరించి సర్వే రాళ్ల వేయిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, కంకటావ మాజీ సర్పంచి బొర్రా దుర్గారావు, మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, వీఆర్వో ఎన్.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత స్థానాలు

మోపిదేవి: విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాలలో మోటివేషన్ తరగతులు బుధవారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. గంజాయి వంటి దురలవాట్లు, జూదాలకు దూరంగా ఉండాలన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు విద్య నేర్పే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పాల ఉత్పత్తిదారులకు రూ.3.48 లక్షల బోనస్‌ను సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ పంపిణీ చేశారు. సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకూ పాలు పోసిన 185 మంది పాల ఉత్పత్తిదారులకు సురేష్ బోనస్ అందించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా పశువులకు దాణా, తెలగపిండి, కాల్షియం, విత్తనాలను అందిస్తున్నామని సురేష్ చెప్పారు. కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

గూడూరు: మల్లవోలులో పునర్నిర్మించిన బాల చౌడేశ్వరిదేవి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాంగుల కుల దేవత అయిన చౌడేశ్వరి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఎంపీటీసీ సభ్యుడు పిట్ల రామిరెడ్డి, చౌడేశ్వరి చేనేత సహకార సంఘ చైర్మన్ పిచ్చుక సుబ్రహ్మణ్యం, నల్లా ప్రసాద్, కుర్మా జంగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

నాగాయలంక: స్థానిక తిప్పాలెంలో పునర్నిర్మితమైన రామాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు గురువారం ప్రారంభిస్తామని ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమా బాబూరావు బుధవారం తెలిపారు. ఈనెల 26వ తేదీన ఆలయంలో నూతన యంత్ర స్థిర విగ్రహాల ప్రతిష్ఠ ఉదయం 11.11 గంటలకు గుండేపూడి నాగరాజ శేఖరశర్మ బ్రహ్మత్వంలో జరుగుతుందన్నారు. 24న గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలతో మూడు రోజుల ఉత్సవం ప్రారంభం అవుతుందని చెప్పారు. 25న మండప దేవతా పూజలు, నిత్యహోమాలు, 26న మండప దేవతా పూజలు, నిత్యాహవనములు, అన్నప్రసాద వితరణ జరుగుతాయని వివరించారు.

అందిన జాబిల్లి

కృత్తివెన్ను/బంటుమిల్లి/మచిలీపట్నం టౌన్: ప్రపంచంలో మరే దేశానికి ఇప్పటివరకు సాధ్యం కాని విజయాన్ని భారతదేశం అందుకుంది. ఎన్నో ఏళ్ల కలను నిజం చేసింది. అంతరిక్షరంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, రష్యా, చైనా దేశాలకు కూడా సాధ్యంకాని విజయాన్ని జాబిల్లిపై చంద్రయాన్ 3 ల్యాండింగ్ ద్వారా భారతదేశం సొంతం చేసుకుంది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా భారత్ అవతరించింది. ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రజలు టీవీలు, సెల్‌ఫోన్ల ద్వారా వీక్షించారు. చంద్రయాన్ 3 జాబిల్లిపై విజయవంతంగా ల్యాండ్ కావడంతో ఆ దృశ్యాన్ని తిలకించిన ప్రజల కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ఇంతటి ఘన విజయాన్ని దేశానికి సాధించి పెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రజలంతా రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి మానవహారం నిర్మించారు. ఉదయం చంద్రయాన్ జాబిల్లిపై ల్యాండింగ్ విజయవంతం కావాలని కోరుతూ పూజలు చేశారు. కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో విద్యార్థులు, స్థానికులు క్యాండిల్ వెలుగుల్లో జయహో భారత్ అనే అక్షరాలను తీర్చిదిద్ది తమ అభిమానాన్ని చాటుకున్నారు. బంటుమిల్లిలో పలు పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి మానవహారం నిర్మించారు. మచిలీపట్నంలో ప్రత్యేక పూజలు చేశారు.



బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల మానవహారం



మచిలీపట్నం శక్తిగుడిలో పూజలు



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో క్యాండిల్ వెలుగులో జయహో భారత్ నినాదం

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ప్రతి గడపకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించి ప్రజల్లో జవాబుదారీతనం పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మందపాకల సచివాలయం పరిధిలోని పాదాలవారిపాలెం, కారంకిదిబ్బ, నరసయ్యగారి దిబ్బ గ్రామాల్లో రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్‌లు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా గ్రామాల్లోని 327 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించారు. ఆయా కుటుంబ సభ్యులు పొందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను అందించి, మరోసారి తమ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని పథకాలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారని రమేష్‌బాబు చెప్పారు. అవినీతికి తావులేకుండా పథకాలకు సంబంధించిన నగదును కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని, ఏ సమస్య వచ్చినా ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉండడంతో పాటు ప్రతి ఇంటి వద్ద మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు ఆంకాక్షిస్తున్నారని తెలిపారు. సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు కూడా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని రమేష్‌బాబు చెప్పారు.



లబ్ధిదారుకు బ్రోచర్ అందించి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు మండలంలో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం..

కోడూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముగిసిందని ఎమ్మెల్యే రమేష్‌బాబు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ప్రజలు తమను ఆదరించిన తీరు హర్షణీయమన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచి అద్దంకి శివప్రసాద్, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, పరిశె వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ఎనలేనివి



గూడూరులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ మధుసూదనరావు



ఘంటసాలలో నివాళులర్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గూడూరు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు గూడూరు మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీపీ సంగా మధుసూదనరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. టంగుటూరి ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, వి. మంజువాణి, కె. రేవతి, ఎం. వెంకటలక్ష్మి, జె. యశ్వంత్ కుమార్, జి. కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి


న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక పవిత్ర డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయరాదని చెప్పారు. జూనియర్లు చదువులో రాణించేలా వారికి సహకరించాలన్నారు. ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు శిక్షార్హులవుతారని చెప్పారు. ముఖ్యంగా విద్యా ర్థులు వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడపడం వంటివి మానుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు విద్యార్థి దశలో వాహనాలు ఇవ్వకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిలకలపూడి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ యూవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యా ర్థులు ఈవ్‌టీజింగ్ వంటి నేరాలకు పాల్పడరాదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, పి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో సీల్డ్ టెండర్ల ఖరారు

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో సీల్డ్ టెండర్ ద్వారా వివిధ వస్తువుల సరఫరాకు లైసెన్స్ హక్కులను ఖరారు చేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో నవంబర్ 1, 2023 నుంచి అక్టోబర్ 31, 2024 వరకు సీల్డ్ టెండర్స్ ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన టెండర్స్ ప్రకటిస్తూ లడ్డూ ప్రసాదం తయారు చేయుటకు మచిలీపట్నానికి చెందిన పి. రామచంద్రరావు 10 కిలోల కళాయికి రూ. 145లకు లైసెన్సు పొందారని చెప్పారు. పులిహోర ప్రసాదం తయారు చేసేందుకు పెదకళ్లేపల్లికి చెందిన ఎ. సాంబశివరావు 10 కిలోలకు గాను రూ. 148.50లు లైసెన్సు పొందారని, కూరగాయలు సరఫరా చేయుటకు మోపిదేవికి చెందిన ఉప్పాల వెంకటేశ్వరావు లైసెన్సు పొందారన్నారు. సర్పదోష నివారణ పూజకు వెండి పూత నాగపాడగల సరఫరాకు గుడివాడకు చెందిన డి. హరిప్రసాద్, ఆలయంలోని నాగమల్లి వృక్షం వద్ద ముడుపులు తీసుకునేందుకు రూ. 1,00,099లకు మచిలీపట్నానికి చెందిన పి. రామచంద్రరావు లైసెన్సు పొందారని తెలి పారు. భక్తులు సమర్పించిన చీరలు–400 వేలం పాట ద్వారా మురళీధర్ రూ. 70 వేలకు కైవసం చేసుకున్నారని తెలిపారు. రాతి నాగశిలలు సరఫరా, అరటి పండ్లు, కొబ్బరికాయలు రైతు బజార్ రేట్లతో సరఫరా, భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కు వాయిదా పడిందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివలింగం ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం



నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి మండపం నిర్మాణం, శివలింగం ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీరామ పాద క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మండపం నిర్మాణకర్తలు కంఠంనేని ప్రేమ్‌చంద్, లోహిత(హైదరాబాద్) దంపతులు రామలింగేశ్వరునికి గంధం, పసుపు, కుంకుమ, విభూది, నారికేళం, గోక్షీరం, పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం విశేష అలంకారంతో తీర్చిదిద్ది హారతులిచ్చారు. రామలింగేశ్వరునికి, నందీశ్వరునికి శాస్త్రోక్తంగా మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్, బోయపాటి రాము, ప్రేమ్‌చంద్ గ్రామస్తులు పాల్గొన్నారు. మండపాన్ని పూలమాలతో అలంకరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మర్రిపాలెం(నాగాయలంక): కోతుల బెడద, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని మర్రిపాలెం రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని దీవుల పర్యటనకు వెళుతున్న కలెక్టర్ పి.రాజాబాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును నాగాయలంక వద్ద మెయిన్ రోడ్డుపై రైతులు కలిసి తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, కాయలు, కూరగాయలు ధ్వంసం చేస్తున్నాయని చెప్పారు. ఉప్పుకాలువ డ్రెయినేజీలో గుర్రపుడెక్కతో పూడుకుపోయి రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

టంగుటూరికి నివాళి..

మండలంలోని ఎదురుమొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. డీఈఓ తాహెరా సుల్తానా, ఎంఈఓలు టీవీఎం రామదాసు, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో గొలుసు చోరీ

కోనేరుసెంటర్: గుర్తుతెలియని ఓ వ్యక్తి బంగారు దుకాణంలో గొలుసు చోరీ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం కోనేరు సెంటర్‌లోని ఉడత్తు జ్యూయలరీ షాపునకు గుర్తు తెలియని ఓ వ్యక్తి బుధవారం వచ్చి బంగారు గొలుసు కావాలని అడిగాడు. షాపులో వ్యక్తి నాలుగైదు రకాల బంగారు గొలుసులు చూపించగా వాటిలో 28 గ్రాముల బరువు గల ఓ గొలుసును చాకచక్యంగా తన సంచిలో వేసుకుని మరలా వస్తానంటూ వెళ్లిపోయాడు. గొలుసులు సర్దుకునే సమయంలో అందులో ఓ గొలుసు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి షాపులోని వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు షాపు వద్దకు చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గూడూరు: కప్పలదొడ్డి గ్రామానికి చెందిన అగ్నిబాధితులు మేకా అంజనేయులు, మేకా సీతారావమ్మ, కోటా సూరిబాబు, కోటా సీతమ్మ కుటుంబాలకు మచిలీపట్నం చలమలశెట్టి ట్రస్ట్ తన వంతు సహాయం అందించింది. ట్రస్ట్ మేనేజర్ చలమలశెట్టి పాండురంగారావు, అడ్డాల నెహ్రూలు బాధితులకు బుధవారం నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు అందజేశారు.

పాలన సజావుగా సాగేందుకు సహకరించండి



కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

- మున్సిపల్ చైర్‌పర్సన్ నాగ కుమారి
- అజెండాలోని 18 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

పెడన: పరిపాలన సజావుగా సాగేందుకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. కౌన్సిల్ అత్యవసర సమావేశం మునిసిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నామని ప్రతి అంశానికి డీసెంట్ ఇస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. గతంలో కూడా డీసెంట్ ఇస్తే జిల్లా కలెక్టర్ దానిని డిస్మిస్ చేశారని గుర్తుచేశారు. జరిగిపోయిన పనికి టెండర్లు పిలవడంపై 12వ వార్డు కౌన్సిలర్ పావని అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీసెంట్ ఇస్తానని అన్నారు. ఈ విషయంపై చైర్‌పర్సన్ పై విధంగా స్పందించారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 18 అంశాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ కాజా, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, చంద్రబాబు, సతీష్, గోపి, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే పేదల అభ్యున్నతి

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మూడో డివిజన్ పెయింటర్స్ కాలనీ ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి పేర్ని కిట్టు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమం అందక చాలా ఇబ్బందులు పడేవారన్నారు. పేదల ఇబ్బందులను దగ్గరగా గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచే వారిని ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధుడిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు

ప్రొఫెసర్ రామచంద్రన్

కోనేరుసెంటర్: పరిశోధనల ద్వారానే గొప్ప గొప్ప ఆవిష్కరణలు సాధ్యమవుతాయని నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య డి. రామచంద్రన్ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్రంలో పరిశోధనలు–అవకాశాలు అనే అంశంపై రామచంద్రన్ మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో పరిశోధనలకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే ఎంఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు యూజీసీ సెట్ ఉత్తీర్ణులైతే ఉపకార వేతనాలతో కూడిన పరిశోధన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలను ప్రోత్సహించేందుకు వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. వాటిపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగివుండాలన్నారు. పరిశోధనల తరువాత ఉన్న విస్తృతమైన అవకాశాలను వివరించారు. నాణ్యమైన పరిశోధనల వలనే భారతదేశం నేడు చంద్రయాన్ ప్రయోగాన్ని సైతం విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పారు. అనంతరం రామచంద్రన్‌ను యూనివర్సిటీలోని రసాయనశాస్త్ర అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రన్

బాలల హక్కుల చట్టాలపై అవగాహన

ఎస్ఐ పైడిబాబు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ పైడిబాబు

బంటుమిల్లి: బాలలు, బాలికలు వేధింపుల బారిన పడకుండా విద్యావంతులై ఉన్నత స్థాయికి ఎదిగేందుకు చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని ఎస్ఐ ఎ. పైడిబాబు అన్నారు. బుధవారం స్థానిక సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బాలల చట్టాలపై అవగాహన సదస్సు, సామర్థ్యం పెంపు తదితర అంశాలపై కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ ఎం. సముద్రవేణి అధ్యక్షత వహించారు. పైడిబాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులతో పనులు చేయించడం నేరమని చెప్పారు. బాలల రక్షణ చట్టాలను వివరించారు. డీసీపీఓ వై.జాన్సన్ మాట్లాడుతూ పోక్సో, బాలికలపై లైంగిక దాడులు, వేధింపుల నియంత్రణ తదితర చట్టాలను వివరించారు. బాలలను కాపాడేందుకు ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత బాల్య వివాహాల సమాచారం వెంటనే అధికారులకు అందుతుందన్నారు. అయినప్పటికి 2022–2023 సంవత్సరంలో జిల్లాలో 53 బాల్య వివాహ కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. చట్టాలను కఠినతరం చేస్తూ ఇటీవల ప్రభుత్వం జీఓ నెం 31ని జారీ చేసిందని, ఈ జీఓ ద్వారా మండల, గ్రామ స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. ఏసీడీపీఓ సుధారాణి, మండల మహిళా పోలీసులు పాల్గొన్నారు.